క్లుప్తంగా

ముగ్దుంపూర్ ఏఈవోగా రేణుక

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని ముగ్దుంపూర్ క్లస్టర్ ఏఈవోగా రేణుకా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లూర్ క్లస్టర్ ఏఈవోగా పని చేసిన రేణుక బదిలీపై ముగ్దుంపూర్‌కు రావడంతో గ్రామస్తులు సన్మానించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏఈవో గ్రీష్మ బాన్సువాడ మండలం దేశాయ్‌పేట క్లస్టర్‌కు బదిలీ అయ్యారు.

మల్లూర్ ఏఈవోగా సాగర్

మల్లూర్ క్లస్టర్ ఏఈవోగా సాగర్ బాధ్యతలు స్వీకరించారు. బీబీపేట మండలం నుంచి మల్లూర్ క్లస్టర్‌కు ఆయన బదిలీపై వచ్చారు.

నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఏవోగా..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల ఇన్‌చార్జి ఏవోగా హరివెంకటప్రసాద్‌ను అధికారులు నియమించారు. నాగిరెడ్డిపేట ఏవో విజయశేఖర్ ఇటీవల నిజామాబాద్ డీఏవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్‌గా..

కామారెడ్డి అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ కామారెడ్డి స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్‌గా కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు ఏ.సుధాకర్‌ను నియమిస్తూ ప్రిన్సిపల్ కే.విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఫంక్షన్‌హాలు ప్రారంభం



బీబీపేట: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మి నరసింహ గార్డెన్‌ను బుధవారం మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రారంభించారు. ఫంక్షన్‌హాలును బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దేవునిపల్లి శ్రీనివాస్ నిర్మించారు. ముఖ్య అతిథిగా గోవర్ధన్ హాజరయ్యారు. జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, మాజీ ఎంపీపీ బాలమణి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు రవీందర్ 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. పలువురిని కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి సిఫారసు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని మహమ్మద్‌నగర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రాజ్ అన్నారు. బుధవారం మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్, తుంకిపల్లి, తుంకిపల్లి తండా ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. సీఆర్పీ శంకర్ గౌడ్ ఉన్నారు.

గోపన్‌పల్లి పాఠశాలలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు శుభ్రం చేసుకోవడానికి అమ్మ ఆదర్శకమిటీ ద్వారా స్కావెంజర్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందరికి అర్థమయ్యే విధంగా బోధించాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు.

చేపల పెంపకానికి ముందుకు రావాలి

బిచ్కుంద(జుక్కల్): చేపల పెంపకానికి ముందుకు వచ్చి ఆర్థికంగా లాభపడాలని ఎస్సీ కార్పొరేషన్ జీడీ దయానంద్ అన్నారు. బుధవారం బిచ్కుందలో పీఎం అజయ్ పథకంపై ఎస్సీ యువకులకు అవగాహన కల్పించారు. ఈ పథకం కింద ఎస్సీ లబ్ధిదారులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తున్నారని, ఆసక్తిగల యువకులు ముందుకు రావాలని అన్నారు. చేపల పెంపకాని రూ.4.50 లక్షల రుణాలు అందిస్తామని, రాయితీ కింద ప్రభుత్వం రూ.2.75 లక్షలు అందిస్తుందని, బ్యాంక్ అధికారులు రూ.1.75 అందిస్తారని తెలిపారు. సొంత భూమి ఉన్న ఎస్సీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో గోపాల్, ఎల్‌వోఎం రవికాంత్ పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ అందజేత

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థిని అలుక బుధవారం వాటర్ డిస్పెన్సర్ అందించారు. అలాగే పూర్వ విద్యార్థి అంతేశ్వర్ పాఠశాల టాపర్లకు రూ. 5 వేల నగదు పారితోషికం, మరో పూర్వ విద్యార్థులు బాలాజీ, పాండురంగ్ ట్రిపుల్ ఐటీకి ఎన్నికైన ఇద్దరు విద్యార్థులకు రూ.10 వేల చొప్పున అందించారు. ఈ పాఠశాలలో చదివి తాము అందరం సీఏగా పని చేస్తున్నామన్నారు. పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీల్ ఉన్నారు.

సీఎంపై విమర్శలు తగవు

కామారెడ్డి అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిపై బురదజల్లే విధంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమని ఐఎన్‌టీయూసీ నాయకుడు గుర్రం నారాయణ ఒక ప్రకటనలో ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకు వంటగ్యాస్ అందిస్తున్న సీఎంను విమర్శించడం తగవని అన్నారు.

రోడ్డు దాటే వరకూ భయమే!



- ప్రమాదపుటంచున విద్యార్థుల చదువులు
- జాతీయ రహదారి దాటాలంటే జంకుతున్న విద్యార్థులు
- ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్టని వైనం
- పట్టించుకోని అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి వల్ల విద్యార్థుల చదువులు ప్రమాదపుటంచున సాగుతున్నాయి. 44వ జాతీయ రహదారి 24 గంటల పాటు రద్దీగా ఉంటుంది. కళాశాల వద్ద యూటర్న్ ఉండడం వల్ల రోడ్డును దాటాలంటే విద్యార్థులు జంకుతున్నారు. ఈ రహదారి పక్కనే ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కళాశాలలు ఉన్నాయి. రోజూ విద్యార్థులు చదువుల కోసం ఈ రోడ్డు దాటాలంటే భయం గుప్పిట్లో పెట్టుకుని నడుస్తున్నారు. అధికారులు, యాజమాన్యాలు రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ వంటి మహా నగరాల్లో పిల్లలందరూ సురక్షితంగా ఇంటికి చేరుకునేలా రూపొందించిన ట్రాఫిక్ విధానాన్ని ఇక్కడ సైతం అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 44వ జాతీయ రహదారి భిక్కనూర్ మండలం బస్వాపూర్ నుంచి సదాశివనగర్ మండలం దగ్గి శివారు వరకు విస్తరించి ఉంది. ఈ రోడ్డు మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ మాత్రం అజాగ్రత్త వహించినా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. చాలా చోట్ల జాతీయ రహదారిపై పక్కనే పాఠశాలలు, కళాశాలలున్నాయి. ముఖ్యంగా కుప్రియాల్ శివారులో మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, మర్కల్ గ్రామ స్టేజీ వద్ద సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, సదాశివనగర్ మండల కేంద్రం శివారులో ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, కళాశాలలున్నాయి. ఈ ప్రాంతాల్లో విద్యార్థులు జాతీయ రహదారిని దాటాలంటే జంకుతున్నారు.

గతంలో జరిగిన ఘటన..

- గతేడాది కుప్రియాల్ స్టేజీ వద్ద గల వసతి గృహంలో ఉన్న కూతురిని తండ్రి సెలవులకు ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా వసతి గృహం ముందు రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కూతురికి తీవ్ర గాయాలయ్యాయి.
- పాఠశాల, కళాశాలలకు వెళ్లే సమయంలో రోడ్డు దాటుతుండగా విద్యార్థులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు జిల్లా వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయి. అన్ని చోట్ల జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- విద్యార్థులు ఇబ్బందులు పడకుండా పాఠశాల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
- పాఠశాల ప్రారంభం, మూసి వేసే సమయాల్లో ప్రత్యేక సిబ్బందిని ఉంచి రోడ్డు దాటించాలి
- పాఠశాల జోన్, సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు ఉన్నారనే సంకేతాలను వాహన చోదకులు దూరం నుంచి గుర్తించేలా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- విద్యాసంస్థలకు ఇరు వైపులా వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలి

దీనిపై ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటి అధికారులను సంప్రదించగా రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నామన్నారు.

భయమేస్తోంది

జాతీయ రహదారి దాటాలంటే పిల్లలు జంకుతున్నారు. అందుకే నేనే స్వయంగా ద్విచక్ర వాహనంపై వెళ్లి ఉదయం పాఠశాలలో దించి రావడం, సాయంత్రం తీసుకురావడం చేస్తున్నాను. ఉదయం, సాయంత్రం వేళలో యూటర్న్ వద్ద పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. సత్వరమే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

– బాబయ్య, విద్యార్థి తండ్రి, సదాశివనగర్

ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలి

– ఆర్డీవో రమేష్ రాథోడ్



బాన్సువాడలో బీఎల్‌వోలతో సమావేశమైన ఆర్డీవో రమేష్ రాథోడ్, పక్కన తహసీల్దార్ ప్రసాద్

బాన్సువాడ : ఓటరు జాబితాపై ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని బాన్సువాడ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, బీఎల్‌వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఓటరు జాబితాపై ఇంటింటా సర్వే చేపట్టాలని, సర్వే ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు కొనసాగుతుందని అన్నారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకుల పేర్లను ఫారం–6లో నమోదు చేసుకోవచ్చునని అన్నారు. సవరణ కోసం ఫారం–8, తొలగింపుల కోసం ఫారం–7 పూరించి బీఎల్‌వోలకు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వరప్రసాద్ తదితరులున్నారు.

వంతెన మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలి



వంతెనను పరిశీలిస్తున్న డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట గ్రామంలో గల పోచారం ప్రధానకాలువపై ఉన్న వంతెన మరమ్మతు పనులను త్వరితగతిన చేపట్టాలని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు సూచించారు. వంతెనను బుధవారం ఆయన పరిశీలించారు. దీంతోపాటు వంతెనకు చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి కొలతలు తీశారు. వంతెన ఇరుకుగా ఉండడంతో పాటు సైడ్‌వాల్స్ కూలిపోవడం వల్ల గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రూ.7 లక్షల 50 వేలతో మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారని, గత ఏప్రిల్‌లో నిధులు మంజూరయ్యాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాగిరెడ్డిపేట గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, నాయకులు వెంకట్, హన్మాండ్లు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ : ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుల మూడు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి ఆర్‌ఎంవో సుజాతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ.. సరైన సమయంలో వేతనాలు రాక సూర్యాపేట్ ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. కార్మికుల బాధలు అర్థం చేసుకుని వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులు సంతోష్‌గౌడ్, రేణుక, కమర్, సురేఖ, పండరి, నాగరాజు, సరోజ, తదితరులు ఉన్నారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలి



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని సీఐటీయూ, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం డీపీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్మికులకు 8 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అయినా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఖర్చుల కోసం పంచాయతీ కార్యదర్శులు తమకు తోచినంతగా కార్మికులకు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. స్పందించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలనర్సు, నాయకులు నర్సింలు, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నలభై శాతం మంది రైతులకే రుణమాఫీ



భిక్కనూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

భిక్కనూరు: రూ. కోట్లు వెచ్చించి రైతులకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం ప్రకటనల వర్షం కురిపిస్తున్నారే తప్ప రైతులందరికి ఈ పథకం వర్తించలేదని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, విండో చైర్మన్లు నాగర్తి భూంరెడ్డి, వలకొండ వెంకట్‌రెడ్డి, ఏనుగు వెంకటర్‌రెడ్డి, తదితరులు విమర్శించారు. బుధవారం వారు భిక్కనూరులో మాట్లాడారు. ఇప్పటి వరకు 40 శాతం మంది రైతులకే రుణమాఫీ వర్తించిందన్నారు. సాంకేతిక కారణాలు చూపుతూ రుణమాఫీ లేదని రైతులను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. నేతలు వెంకటిగౌడ్, తక్కళ్ల రవీందర్‌రెడ్డి, అంబల్ల మల్లేషం, తదితరులు పాల్గొన్నారు. రైతులందరికి రుణమాఫీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ నేడు భిక్కనూరు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు నేతలు తెలిపారు.

నేడు బోర్లంక్యాంపునకు కలెక్టర్ రాక



బాన్సువాడ రూరల్: నాటుదాం ఒక చెట్టు– అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గురువారం బోర్లంక్యాంపు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరు కానున్నట్లు ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. కలెక్టర్ పర్యటనను పురస్కరించుకుని బుధవారం పాఠశాల, కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేయించారు. పిచ్చిమొక్కలను తొలగించి, ప్రాంగణాన్ని చదును చేయించారు.



బీబీపేట బంద్‌లో పాల్గొన్న హిందూ ఐక్యవేదిక సభ్యులు



మాచారెడ్డిలో మూసి ఉన్న దుకాణాలు

బంద్ ప్రశాంతం

బీబీపేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీబీపేట హిందూ ఐక్యవేదిక తలపెట్టిన బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా దుకాణాలు మూసేశారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పలువురు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దాడులను ప్రతి హిందువు వ్యతిరేకించాలని వారు కోరారు.

మాచారెడ్డి: హిందువులపై దాడులకు నిరసనగా బీజేపీ శ్రేణులు ప్రకటించిన బంద్ మాచారెడ్డిలో విజయవంతమైంది. ఈ సందర్భంగా గజ్యానాయక్ తండా చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి దుకాణాలు బంద్ చేయించారు.

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ కోరారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలను నాటాలన్నారు. నర్సరీలలో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఏపీవో మల్లేష్, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలి



కామారెడ్డి టౌన్: చాలా మంది రక్తహీనతతో అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని, నివారణకు ఐరన్‌తో కూడిన పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని పట్టణానికి చెందిన గైనిక్ వైద్యులు లక్ష్మి వినీల అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాందీపని కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రుతుక్రమం, రక్తహీనత, పౌష్టికాహారం, బలహీనత, క్యాన్సర్ తదితర ఆరోగ్య సమస్యలు, లక్షణాలు, నివారణ చర్యలపై గురించి వివరించారు.

రైతుల రుణాలు మాఫీ చేయండి



మద్నూర్(జుక్కల్): రైతులందరికి రుణమాఫీ చేయాలని బీకేఎస్ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్ కార్యాలయానికి మద్నూర్, డోంగ్లీ మండలాల రైతులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు చేరుకుని తహసీల్దార్ ముజీబ్‌కు ఈ మేరకు వినతి పత్రం అందించారు. సంఘ్ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రూ.2 లక్షల వరకు ఉన్న రైతులందరికి రుణాలు మాఫీ చేయాలని కోరారు.

రహదారిపై కూలిన చెట్టు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తుంకిపల్లి గేటు సమీపంలో బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బుధవారం సాయంత్రం ఓ భారీ వృక్షం కూలింది. చెట్ల కొమ్మలను స్థానికులు తొలగించడంతో రాకపోకలు సాగాయి.

భారత్ బంద్ విజయవంతం



లింగంపేటలో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు



ఎల్లారెడ్డి: నిరసన తెలుపుతున్న బీఎస్పీ నేతలు



నస్రుల్లాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న నేతలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా మాల మహానాడు తో పాటు పలు సంఘాల నాయకులు వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, హోటళ్లు మూసివేయించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీర్పును ఉపసంహరించుకునే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. – సాక్షి నెట్‌వర్క్



మద్నూర్‌లో..



బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో తరగతులు బహిష్కరిస్తున్న నేతలు

డెంగీ బాధితులను కాపాడే ఎస్‌డీపీ మిషన్ ప్రారంభించాలి

కామారెడ్డి అర్బన్: డెంగీ బాధితులను కాపాడటానికి రూ.40లక్షల వ్యయంతో తీసుకువచ్చిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్(ఎస్‌డీపీ) మిషన్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయకర్త బాలు కోరారు. కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి రూ.40 లక్షలతో కొనుగోలు చేసినప్పటికి కావాల్సిన అనుమతులు తీసుకురావడంలో వైద్యశాఖ అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని బాలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించి మిషన్‌ను ప్రారంభించాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ అన్నారు. ఎండ్రియాల్ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యదర్శి అనిత, జీపీ సిబ్బంది ఉన్నారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్లబావి వద్దకు మట్టి రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. నాయకులు బుర్ర నారాగౌడ్, అశోక్, సంగయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు

బాన్సువాడ రూరల్: తాడ్కోల్, బోర్లం గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో బుధవారం బాచేపల్లి మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీవో బషీరుద్దీన్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చెట్ల నరికివేతపై నిలదీత

బాన్సువాడ : బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో టెండర్ వేయకుండానే చెట్లు నరికివేయడంతో బుధవారం పలువురు నేతలు కాంట్రాక్టర్‌ను నిలదీశారు. ఆస్పత్రిలో నూతన భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు మంజురు చేసింది. టెండర్ కూడా పూర్తయింది. అయితే పాత భవనాన్ని కూల్చి వేసేందుకు ఓ కాంట్రాక్టర్ రూ.40 లక్షలకు పనులను దక్కించుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న చెట్లకు కూడా టెండర్ పిలిచి చెట్లను తొలగించాల్సి ఉంది. అలా కాకుండా అన్ని నరికివేస్తుండడంతో స్థానిక కాంగ్రెస్, బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో చెట్ల నరికివేతను నిలిపివేశారు.

పాఠశాలపై ఫిర్యాదు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలపై బుధవారం మండల పరిషత్ అధికారులకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు. నివాసపు గృహం పేరిట అనుమతులు తీసుకొని పాఠశాల నడుపుతున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఫిర్దోస్ ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

నిజాంసాగర్(జుక్కల్): సంక్షేమ వసతి గృహాలతో పాటు కస్తూర్బా గాంధీ విద్యార్థినుల ఆరోగ్యంపై వసతి గృహాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల ప్రత్యేక అధికారి జ్యోతి అన్నారు. బుధవారం అచ్చంపేట ఎస్సీ గురుకులం, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఆమె వెంట ఎంపీడీవో గంగాధర్ తదితరులున్నారు.

వీహెచ్‌పీ బజరంగ్ గ్రామ కమిటీ ఎన్నిక



లింగంపేట(ఎల్లారెడ్డి): కొండాపూర్ విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా త్రిపఖండ సంఘటన మంత్రి వినోద్ తెలిపారు. అధ్యక్షుడిగా గంగాగౌడ్, ఉపాధ్యక్షుడిగా సిద్ధిరాములు, కార్యదర్శిగా కాశీరాం, సత్సంగ్ ప్రముఖ్‌లుగా సాయికుమార్, విష్ణు, భజరంగ్‌దళ్ సంయోజక్‌లుగా గంగారాం, భానుప్రసాద్, గోరక్షక్‌లుగా సంతోష్‌కుమార్, బాలయ్య, విద్యార్థి ప్రముఖ్‌లుగా సృజన్‌కుమార్, సంపత్‌గౌడ్, బలోపాసన ప్రముఖ్‌లుగా గంగారం, శుభాష్, సేవా ప్రముఖ్‌లుగా మహేష్, అంజనేయులు శ్రీనివాస్, ప్రచారక్ ప్రముఖ్‌గా సాయిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన ఉండాలి

మద్నూర్(జుక్కల్): ఆయుర్వేద వైద్యంపై అవగాహన ఉండాలని ఆయుష్ సీనియర్ వైద్యులు ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో బుధవారం ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వయోవృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఎంపీడీవో రాణీ, జిల్లా ప్రొగ్రాం మేనేజర్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.